క్లుప్తంగా

కామనగరువులో ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అమలాపురం రూరల్: స్థానిక లయన్ క్లబ్ వశిష్ఠ ఆధ్వర్యంలో కామనగరువు గ్రామ సచివాలయం–2 వద్ద శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ నక్కా అరుణ కుమారి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో కిమ్స్ వైద్యులు బీపీ, షుగర్, కంటి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, ఉప సర్పంచ్ రాజుపూడి భాస్కరరావు, మాజీ సర్పంచ్ రాజులపూడి వెంకటేశ్వరరావు, మాజీ ఉప సర్పంచ్ చొల్లంగి శ్రీనివాసరావు, కార్యదర్శులు పి.ఆదినారాయణ, సూరిబాబు, నక్కా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల్లో చైతన్యం కోసమే మిషన్ శక్తి

తాళ్లరేవు: మహిళలు, బాలికలకు చట్టాలపై అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకురావడం కోసమే ప్రభుత్వం మిషన్ శక్తి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం కోరింగ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో మిషన్ శక్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల చట్టాలు, గృహ హింస, బాల్య వివాహాలు, పోక్సో తదితర చట్టాలు, శిక్షలపై శ్రీనివాస్ వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.సువర్ణజ్యోతి, కళాశాల డైరెక్టర్ చిట్టూరి కలికిమూర్తి, నాగరత్నమాల, ఐసీడీఎస్ ఈఓ ఎంఎస్ నళిని, ఎస్.రమ్య, వి.దేవి ప్రియాంక, ఎస్.హేమలత పాల్గొన్నారు.

ఆశాజనకంగా లేని కేంద్ర బడ్జెట్

అమలాపురం టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆశాజనకంగా లేదని ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు డీబీ లోక్ అన్నారు. శనివారం స్థానిక అరిగెలపాలెంలో లోక్ అధ్యక్షతన జరిగిన ఆర్‌పీఐ నాయకుల సమావేశంలో కేంద్ర బడ్జెట్‌కు సంబంధించి రాష్ట్రానికి కేటాయించిన నిధులు కేవలం అంకెల రూపంలో ఉన్నాయే తప్ప వాస్తవ పరిస్థితుల్లో ఇప్పుడు అక్కరకు వచ్చే రీతిలో లేవని లోక్ విమర్శించారు. బడ్జెట్ తీరు పరిశీలిస్తే ప్రాంతీయ సమతుల్యం లేని బడ్జెట్‌గా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.వెంకట బాబ్జి, ఉండ్రు శ్యామలరావు, డి.ఆంజనేయులు, పి.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిపల్లిలో ఆధార్ శిబిరం



రెడ్డిపల్లిలో ఆధార్ శిబిరం ప్రారంభించిన సర్పంచ్ ప్రసన్న

అమలాపురం రూరల్: మండలంలోని రెడ్డిపల్లి గ్రామ సచివాలయంలో శనివారం ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంప్‌ను సర్పంచ్ కరాటం ప్రసన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధార్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాగాబత్తుల పృథ్వీరాజ్, ఆర్.మహేష్, కళ, జి.పార్థు, లావణ్య, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



ఎస్పీ కృష్ణారావుకు పూల మొక్కను అందిస్తున్న ఎస్ఐ హరీష్‌కుమార్

అల్లవరం: ఇటీవల జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన బి.కృష్ణారావు అల్లవరం పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలిసారిగా పోలీస్‌స్టేషన్‌కు విచ్చేసిన జిల్లా ఎస్పీ కృష్ణారావుకు ఎస్ఐ హరీష్‌కుమార్ పూల మొక్కను అందించి స్వాగతించారు. అనంతరం ఎస్పీ కృష్ణారావు పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను తనిఖీ చేశారు. ప్రజలకు పోలీసులపై నమ్మకం కలిగేలా ఫ్రెండ్లీ పోలీస్ విధానం కలిగి ఉండాలని, ప్రతిఒక్కరూ నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సిబ్బందికి సూచించారు. ఎస్పీ వెంట డీఎస్పీ ఉమామహేశ్వరరావు, సీఐ వీరబాబు తదితరులున్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై ఫిర్యాదు చేస్తా

కాట్రేనికోన: పల్లంకుర్రు పంచాయతీ రేవు వద్ద తనకు సమాచారం లేకుండా వరద బాధితులకు టీడీపీ నేతలతో బియ్యం పంపిణీ చేసి ప్రొటోకాల్ ఉల్లంఘించారని, దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని సర్పంచ్ నాతి అలివేణి అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ మండలంలోని వరద బాధితులకు బియ్యం పంపిణీ కార్యక్రమానికి రెవెన్యూ సిబ్బంది తనను పిలిచి, తాను రాకుండానే టీడీపీ నేతలతో కార్యక్రమం పూర్తి చేయడం తనను అవమానించడమేనన్నారు.

ముంచుకొస్తున్న వరద

- క్రమేపీ పెరుగుతున్న గోదావరి వరద ఉధృతి
- ఆందోళనలో ముంపు ప్రాంతాల ప్రజలు

ఐ.పోలవరం: గోదావరి వరద ఉధృతి శనివారం ఉదయం నుంచి తిరిగి క్రమేపీ పెరుగుతోంది. ధవళేశ్వరం నుంచి భారీగా వరద నీరు దిగువనకు వదులుతుండడంతో వృద్ధ గౌతమీ నదీపాయల్లో వరద పోటెత్తుతోంది. అన్నంపల్లి అక్విడెక్టును వరద నీరు తాకింది. దీంతో ఇప్పటికే ముంపులో ఉన్న పలు గ్రామాల ప్రజలు పెరుగుతున్న వరదను చూసి ఆందోళన చెందుతున్నారు. ఐ.పోలవరం మండలం పాగాకులంక, పల్లిగూడెం గ్రామాల్లో ఇప్పటికే ఇళ్ల చుట్టూ వరద నీరు ముంచెత్తింది. వారం రోజులుగా గ్రామాల్లో వరద నీరు నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా పెరుగుతున్న వరదతో ఆయా గ్రామాల ప్రజలు ఖాళీ చేయక తప్పదని అధికారులు భావిస్తున్నారు. మురమళ్ల రాఘవేంద్ర వారధి వద్ద మత్స్యకార కాలనీలో వరద ఉధృతి మరింత పెరిగింది. ఎదుర్లంక వారధిని ఆనుకుని ఎదుర్లంక, పాత ఇంజరం, కొమరిగిరిలో ఏటిగట్లను వరద నీరు తాకుతోంది. ఇక్కడ కొబ్బరి, ఇతర అంతర పంటలు పూర్తిగా నీట మునిగాయి.

వరద బాధితులకు బియ్యం పంపిణీ

అల్లవరం: బోడసకుర్రు పంచాయతీ పల్లిపాలెంలో వరద బాధిత కుటుంబాలకు తహసీల్దార్ సునీల్ కుమార్, సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి తక్షణ సాయంగా 25 కేజీల బియ్యాన్ని శనివారం పంపిణీ చేశారు. వరద ముంపులో ఉన్న 91 కుటుంబాలకు బియ్యం పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మిగిలిన కుటుంబాలకు సైతం బియ్యం ఇస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణమోహన్, ఆర్ఐ దుర్గా శ్రీనివాస్, కార్యదర్శి దుర్గా శ్రీనివాస్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.



వరద బాధితులకు బియ్యం అందిస్తున్న తహసీల్దార్ సునీల్‌కుమార్, సర్పంచ్ విజయలక్ష్మి తదితరులు



మురమళ్ల రాఘవేంద్ర వారధి వద్ద వరద ఉధృతి

ముంపులో 250 ఎకరాల నారుమళ్లు

అధిక వర్షాల కారణంగా అల్లవరం మండలంలోని వివిధ గ్రామాల్లో 250 ఎకరాల్లో నారుమడులు ముంపులో ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు అన్నారు. వర్షాల ప్రభావంతో అల్లవరం, రెల్లుగడ్డ గ్రామాల్లోని ముంపులో ఉన్న నారుమడులను ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావుతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు మాట్లాడుతూ రామేశ్వరం మొగలో ఇసుక మేటలను తొలగించడంతో ముంపు సమస్య తీరే అవకాశం ఉందన్నారు. ముంపు నీరు దిగిన వెంటనే నారుమడులకు ఎకరానికి 20 కేజీల యూరియా, 15 కేజీల పొటాష్ చల్లాలని సూచించారు. అలాగే నారు కుళ్లిపోకుండా ఉండేందుకు హెక్సాకోనాజోల్ మందును పిచికారీ చేయాలన్నారు. అల్లవరం మండలంలో 950 ఎకరాల్లో వరి నాట్లు పూర్తయ్యాయన్నారు. అధిక వర్షాల కారణంగా 250 ఎకరాల్లో నారుమడులు దెబ్బతిన్నాయని, మరో 20 ఎకరాల్లో వరినాట్లు మునిగాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, ఎంపీటీసీ ఎస్.మౌనిక, ఏడీ షంషీ, ఏఓ ఎస్‌వీవీ సత్యనారాయణ, విస్తరణాధికారి శివమోహన్, రైతులు కొనుకు బాపూజీ, పచ్చిమాల ఏడుకొండలు, సుబ్బారాజు, వెంకటరమణ, వ్యవసాయ సహాయకులు శుభ గణేష్, ఈశ్వర్, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.



రెల్లుగడ్డలో మునిగిన నారుమడులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు తదితరులు

ప్యానల్ కమిటీలను నియమించాలి

- కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు డిమాండ్
- ఎక్స్‌అఫీషియో సభ్యునిగా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అమలాపురం టౌన్: మున్సిపాలిటీలో పలు విభాగాలకు తక్షణమే ప్యానల్ కమిటీలను నియమించాలని కమిషనర్ ఎస్.మనోహర్‌కు ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అధ్యక్షతన స్థానిక మున్సిపల్ కార్యాలయ కౌన్సిల్ హాలులో శనివారం ఉదయం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ కౌన్సిల్ ఎక్స్ అఫీషియో సభ్యుని హోదాలో కౌన్సిల్‌కు తొలిసారిగా హాజరై బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, చైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి, కమిషనర్ మనోహర్, కౌన్సిలర్లు పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు.

ఫైళ్ల మాయంపై చర్చ

మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు సంబంధించి ఫైల్స్ మాయం అవుతున్నాయని పాలకపక్షం కౌన్సిలర్ మట్టపర్తి నాగేంద్ర ఆందోళన వ్యక్తం చేశారు. తన వార్డులో తనకు తెలియకుండానే పని పూర్తి చేసినట్లు కాగితాల్లో చూపించారని, ఆ పనికి సంబంధించిన ఫైల్ కార్యాలయ ఇంజినీరింగ్ సెక్షన్‌లో కనపించడం లేదని కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరరావు చెప్పారు. దీంతో సభ్యులంతా దీనిపై ఇంజినీరింగ్ అధికారులను నిలదీశారు. ఇంజినీరింగ్ సెక్షన్‌లోని కొన్ని ఫైళ్లు దాచే బీరువాల తాళాలు కాంట్రాక్టర్ల వద్ద ఉంటున్నాయని కౌన్సిలర్ నాగేంద్ర ఆరోపించారు. ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్ కూడా జోక్యం చేసుకుని బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు. స్పందించిన కమిషనర్ మనోహర్ మాట్లాడుతూ దీనిపై తాను పూర్తి విచారణ చేస్తానని స్పష్టం చేశారు. తప్పు జరిగితే బాధ్యులైన ఇంజినీరింగ్ సిబ్బందికి చార్జి మెమోలు జారీ చేసి చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో ఆ అంశానికి అక్కడితో తెరపడింది. పట్టణంలో ఇటీవల కాలంలో కుక్కల బెడద ఎక్కువైందని కౌన్సిలర్ గొవ్వాల రాజేష్ ఆందోళన వ్యక్తం చేశారు. కుక్కలకు సంతాన వృద్ధి లేకుండా శస్త్ర చికిత్సలు చేయించాలని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు సూచించారు. స్థానిక 27వ వార్డులో అర్బన్ హెల్త్ సెంటరు భవనం రూ.కోట్లతో నిర్మించి కూడా తగిన సౌకర్యాల కల్పన లేదని కౌన్సిలర్ బండారు గోవిందు ఆవేదన వ్యక్తం చేశారు. బోడసకుర్రు టిడ్కో ఇళ్ల సముదాయం వద్ద మున్సిపాలిటీ ప్లంబర్, ఎలక్ట్రీషియన్ తదితర విభాగాలకు నియమించిన ఉద్యోగులు అక్కడ విధులు నిర్వర్తించడం లేదని కౌన్సిలర్ తిక్కా సత్యలక్ష్మి కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై తాను టిడ్కో గృహ సముదాయాన్ని సందర్శించి విచారణ చేస్తానని కమిషనర్ మనోహర్ స్పష్టం చేశారు. సమావేశంలో వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, కౌన్సిలర్లు సంసాని బులినాని, గొవ్వాల రాజేష్, యేడిద శ్రీను, అబ్బిరెడ్డి చంటి, కొల్లాటి దుర్గాబాయి, వాసర్ల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ను సత్కరించిన ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి, కౌన్సిలర్లు

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణ

అమలాపురం టౌన్: వరదల వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక యెండూరి కన్వెన్షన్ హాలులో శనివారం జరిగిన జిల్లా సీపీఐ జనరల్ బాడీ సమావేశానికి సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వరదల కారణంగా బాధితులు ఎదుర్కొంటున్న కష్టాలు, రైతుల అవస్థలను ఆయన వివరించారు. గోదావరి కోతను నివారించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ కోటిపల్లి–నర్సాపురం రైల్వే లైన్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, చెల్లుబోయిన కేశవశెట్టి, దేవ రాజేంద్రప్రసాద్, కె.రామకృష్ణ, శీలం వెంకటేష్, పెద్దిరెడ్డి రాము తదితరులు పాల్గొన్నారు.

నీతి ఆయోగ్ సమావేశానికి సీఎం రంగసామి గైర్హాజరు

యానాం: దేశంలోని వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో శనివారం జరిగిన నీతి ఆయోగ్ సమావేశానికి పుదుచ్చేరి సీఎం రంగసామి గైర్హాజరవ్వడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. శుక్రవారం వరకూ సీఎం ఢిల్లీ వెళతారని భావించినా ఆఖరి నిమిషంలో ఆయన పర్యటన విరమించుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి నమశ్శివాయం ఓటమి పాలవడంతో ఎన్ఆర్ కాంగ్రెస్, బీజేపీ పార్టీల మధ్య తీవ్ర విభేదాలు చోటుచేసుకున్నాయి. దీంతో ఇటీవల బీజేపీ ఎమ్మెల్యేలు, కూటమికి మద్దతిస్తున్న స్వతంత్ర ఎమ్మెల్యేలు రెండుసార్లు ఢిల్లీ వెళ్లి అధిష్ఠానానికి రంగసామి, నమశ్శివాయం వ్యవహారశైలిపై ఫిర్యాదు చేశారు. మంత్రులను రొటేషన్ పద్ధతిలో మార్చాలని కోరారు. ఈ నేపథ్యంలోనే ఆయన పర్యటన విరమించుకున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ

ఆలమూరు: మండలంలోని మడికిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు శనివారం స్టూడెంట్ కిట్స్ పంపిణీ జరిగింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు సమకూర్చిన విధంగా ఐదు రకాల వస్తువులతో కూడిన కిట్లను ఆయా పాఠశాలల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు, టీడీపీ నేతలు అందజేశారు. ఈ స్టూడెంట్ కిట్‌లో నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, బెల్ట్, సాక్సులు, పుస్తకాల బ్యాగ్‌తో కూడిన స్టూడెంట్ కిట్లను సద్వినియోగం చేసుకుని చక్కని విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయా పాఠశాలల ఉపాధ్యాయ బృంద సభ్యులు విజ్ఞప్తి చేశారు.

బోధనా విధానాలు మెరుగుపరచుకోవాలి

అమలాపురం టౌన్: టీచ్ టూల్ విధానం ద్వారా ఉపాధ్యాయులు తరగతి గదుల్లో బోధనా విధానాలను మరింత మెరుగుపరచుకోవాలని డీఈఓ ఎం.కమలకుమారి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గత 9 రోజులుగా టీచ్ టూల్‌పై డివిజన్‌లోని ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఈఓ మాట్లాడుతూ శిక్షణను ఉపాధ్యాయులు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. టీచ్ టూల్‌లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులంతా విద్యా విధానంతో మెరుగైన బోధనతో రాష్ట్రంలోనే జిల్లాను ముందు వరుసలో నిలపాలని ఆకాంక్షించారు. మరో అతిథి, సమగ్ర శిక్ష జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదనరావు మాట్లాడుతూ విద్యార్థులకు బోధనలో కొత్త ఒరవడి కోసం ప్రవేశపెట్టిన టీచ్ టూల్ విధానాన్ని తరగతి గదుల్లో ఉపాధ్యాయులు తూ.చ. తప్పకుండా అమలు చేయాలని కోరారు. కోర్స్ కో ఆర్డినేటర్లు లక్ష్మీనారాయణ, దుర్గాదేవి, ఏఎంఓ పి.రాంబాబు, సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.రాజరాజేశ్వరి, సీఆర్పీలు మెండి శ్రీనుబాబు, గణేష్, సోమేశ్వరరావు, చందు తదితరులు పాల్గొన్నారు.



ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ కమలకుమారి

అంటువ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు



పినపళ్లలోని పేపరుమిల్లు కార్మికులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

ఆలమూరు: సీజనల్ దృష్ట్యా సంభవించే మలేరియా, డెంగీ, డయేరియా తదితర అంటువ్యాధి నివారణకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక చర్యలను చేపట్టింది. అందులో భాగంగా మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల ప్రధాన వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి, డి.మల్లికార్జున్, డి.సాయికిషోర్ ఆదేశాల మేరకు వైద్యారోగ్య సిబ్బంది గ్రామ శివార్లలో నివసిస్తున్న కార్మికులకు శనివారం ప్రత్యేక వైద్యసేవలను అందించారు. ఇటుక బట్టీలు, రైసుమిల్లులు, పేపరు మిల్లులో పనిచేస్తున్న కార్మికుల వద్దకు వెళ్లి వైద్య సిబ్బంది వెళ్లి అంటువ్యాధులు సోకకుండా తీసుకోవలసిన చర్యలపై కార్మికులకు అవగాహన కల్పించారు. మధుమేహం, రక్తపోటు, మలేరియా, రక్త నిర్ధారణ తదితర పరీక్షలు నిర్వహించి వివరాలను నమోదు చేసుకున్నారు. ఆరోగ్యపరమైన సమస్యలు ఉత్పన్నమైతే సత్వరమే సమీప పీహెచ్‌సీని సందర్శించి రక్తపరీక్షలు చేయించుకుని మెరుగైన చికిత్సను తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి పాల్గొన్నారు.

అమ్మకు గుర్తుగా మొక్క నాటాలి

అంబాజీపేట: ప్రతి ఒక్కరికీ జీవితంలో అమ్మే ముఖ్యమని జిల్లా డీఈవో ఎం.విమలకుమారి, సమగ్ర శిక్ష ఏపీసీ ఎ.మధుసూధనరావులు పిలుపునిచ్చారు. నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో శిక్ష సప్తాహ్ 6వ రోజులో భాగంగా అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో కలసి వారి తల్లులు మొక్కలను శనివారం నాటారు. హెచ్‌ఎం కడలి సాయిరామ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వీరు మాట్లాడుతూ అమ్మ ఎలా పెంచి పెద్ద చేసిందో అదే తరహాలో నాటిన మొక్కలను కూడా సంరక్షించి అవి పెరిగే వరకు కాపాడుకుని పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. గ్లోబలైజేషన్ పేరుకుపోతున్న ప్రస్తుత సాంకేతిక యుగంలో పర్యావరణానికి ప్రాధాన్యతను ఇవ్వవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మన పరిసరాలు కాంక్రీట్ జంగిల్‌గా మారిపోతున్న తరుణంలో పర్యావరణాన్ని కాపాడుకోవల్సిన బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు పీవీవీ సుబ్రహ్మణ్యం, డి.రమేష్‌బాబు, పి.రాంబాబు, డాక్టర్ ఎండీ భీమారావు, ఎంవీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. హెచ్‌ఎం కడలి సాయిరామ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ మోకా ప్రకాష్, పీడీ కె.ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు వెన్నపు సత్నారాయణ, బొక్కా వెంకటేశ్వరరావు, కామిశెట్టి మధుబాబు, పితాని త్రిమూర్తులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న డీఈఓ కమలకుమారి, విద్యార్థులు, వారి మాతృమూర్తులు

టౌన్ ప్లానింగ్ అధికారులపై ఆగ్రహం

ముమ్మిడివరం: నగర పంచాయతీ టౌన్ ప్లానింగ్ విభాగం అస్తవ్యస్తంగా తయారైందని, టౌన్ ప్లానింగ్ ఉద్యోగుల వేధింపులు తారస్థాయికి చేరుకున్నాయని కౌన్సిలర్ బొంతు సత్యశ్రీనివాస్ ఆరోపించారు. నగర పంచాయతీ సమావేశ మందిరంలో శనివారం చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ బొంతు సత్యశ్రీనివాస్ మాట్లాడుతూ నగర పంచాయతీ ఎక్కువ భాగం గ్రామీణ ప్రాంతంలో ఉందని ఇంటి నిర్మాణానికి 14 శాతం టాక్స్ విధిస్తున్నారన్నారు. అయితే నాన్ లేఅవుట్, లేఅవుట్‌ల్లో విధిస్తున్నట్లుగా ప్రైవేటు స్థలానికి పన్ను విధించడం దారుణమన్నారు. అధికారులు తీరు మార్చుకోకపోతే మున్సిపాలిటీ ఆర్జేడీ వద్ద ఆందోళనకు దిగవలసి వస్తుందని హెచ్చరించారు. దీనిపై చైర్మన్ ప్రవీణ్‌కుమార్ స్పందిస్తూ సచివాలయ ప్లానర్లు అప్రూవల్‌కు వచ్చిన దరఖాస్తులను 15 రోజులైనా తమ లాగిన్‌లో ఉంచుకుంటున్నారని, రెండు రోజుల వ్యవధిలో క్లియరెన్స్ ఇవ్వకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష ఫ్లోర్ లీడర్ ములపర్తి బాలకృష్ణ, ఆడబాల సతీష్ కుమార్‌లు మాట్లాడుతూ వర్షాకాలం కారణంగా రోడ్లు, డ్రైనేజీలు అధ్వానంగా మారి దోమలు పెరిగిపోయి ప్రజలు డెంగ్యూ వంటి వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. బ్లీచింగ్, క్లోరినేషన్ వంటి చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ట్యాంకులు శుభ్రం చేయక తాగునీరు కలుషితమవుతుందని, ప్రజలకు సక్రమంగా తాగునీరు అందించలేకపోతున్నారని కౌన్సిలర్లు ములపర్తి బాలకృష్ణ, బొంతు సత్యశ్రీనివాస్ ఆరోపించారు. దీనిపై ఏఈ సత్యనారాయణ మాట్లాడుతూ మోటార్లతో అక్రమంగా నీటిని వినియోగించుకోవడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందని బదులిచ్చారు. దీనిపై చైర్మన్ ప్రవీణ్‌కుమార్ స్పందిస్తూ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, నగర పంచాయతీ ఇంజినీరింగ్ అధికారుల మధ్య సమన్వయం లోపం కనిపిస్తుందని, తాగునీటి సరఫరా, శానిటేషన్ విషయంలో సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. టైమర్లు పనిచేయక వీధి దీపాలు 24 గంటలూ వెలుగుతున్నాయని విద్యుత్ స్తంభాలు విరిగిపోయి, తీగలు వేలాడుతున్నాయని కౌన్సిలర్లు గంజా శ్రీనివాసరావు, బొంతు సత్యశ్రీనివాసరావులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో వైస్ చైర్మన్లు రెడ్డి హేమసుందరి, వేటుకూరి బోసురాజు, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.



కౌన్సిల్‌లో వివిధ అంశాలపై చర్చిస్తున్న సభ్యులు

వరద ముంపు గ్రామాల్లో కలెక్టర్ పర్యటన



అప్పనరామునిలంకలో వరద నీటిలో పడవపై ప్రయాణిస్తున్న కలెక్టర్



టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద బాధితులకు ఫుడ్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్

సఖినేటిపల్లి: మండలంలోని వరద ముంపు గ్రామాలైన టేకిశెట్టిపాలెం, అప్పనరామునిలంక గ్రామాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ శనివారం పర్యటించారు. టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద నుంచి అప్పనరామునిలంకకు కలెక్టర్ పడవలో వెళ్లి మరీ వరద పరిస్థితులను పరిశీలించారు. టేకిశెట్టిపాలెం పరిధిలోని అగ్నికుల క్షత్రియ కాలనీ, అప్పనరామునిలంక పరిధిలోని ఓఎన్జీసీ కాలనీని చూశారు. వరదలో పడవలపై రాకపోకలు సాగిస్తున్న బాధితులతో కలెక్టర్ మాట్లాడారు. అనంతరం ఏటిగట్టు వద్ద కొంత మంది రైతులు కలెక్టర్‌ను కలసి, ధాన్యం సొమ్ములు తమ ఖాతాలకు త్వరితగతిన జమ అయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద నిర్వహిస్తున్న వైద్య శిబిరానికి అప్పనరామునిలంక నుంచి ముంపు నీటిలో అత్యవసర వైద్యసేవలకు రావడానికి చాలా ఇబ్బందులు పడుతున్నామని సదరు గ్రామస్తులు కలెక్టర్‌కు వివరించారు. అలాగే లంక గ్రామాలలో 2020–21 వరదలకు గురైన ముంపు బాధితులకు భోజనాలకు, గ్రూపు నావలకు, వివిధ సౌకర్యాలకు గాను బకాయిలు ఉన్న రూ.37 లక్షలు విపత్తు నిధులు ఇంత వరకూ అధికారులు చెల్లింపులు చేయలేదని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీనిపై తగు పరిశీలన చేస్తామని కలెక్టర్ తెలిపారు. వెంట మండల ప్రత్యేకాధికారి సిద్ధార్థన్ వర్ధన్, ఎంపీడీవో పీవీ సత్యనారాయణ, తహసీల్దారు సీహెచ్ పెద్దిరాజు, ఏవో పీవీ నరసింహారావు, ఏపీవో నాగ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శిరీష, కార్యదర్శి గంగరాజు, రాజోలు సీఐ గోవిందరాజు, ఎస్సై ఎస్.రాము, సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు, విస్సా తాతయ్య నాయుడు, తాడి సత్యనారాయణ, బర్రె శ్రీను పాల్గొన్నారు. ఇదిలా ఉండగా టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద వరద బాధితులకు ప్రభుత్వ పరంగా సమకూర్చిన ఫుడ్ ప్యాకెట్లను కలెక్టర్ పంపిణీ చేశారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించి, ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. దేవదాయ–ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, దేవస్థానం ఈఓ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో భక్తుల పూజలకు ఏర్పాట్లు చేశారు. ఆలయ అర్చకులు, వేదపండితులు స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపిన అనంతరం భక్తుల దర్శనానికి అనుమతించారు. భక్తుల పూజలు, తైలాభిషేకాల టికెట్ల ద్వారా దేవస్థానానికి రూ.1,42,940, అన్న ప్రసాదం విరాళాల రూపంలో రూ.39,920తో మొత్తం రూ.1,82,840 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు.